# బంగారయ్యగారి భోషాణం!

పూజగదిలో గంటలచప్పుడు. ఆ తర్వాత గాలిలో తేలుతూ వచ్చిన అగరొత్తుల వాసన. కళ్ళు తెరిచి మళ్ళీ మూసుకున్నాడు నారాయణమూర్తి. మెలకువ వచ్చేసరికి కాఫీ పరిమళం ముక్కుపుటాలను తాకింది. నాన్న పూజ అయినట్టుంది. ఇపుడు కాఫీ కలిపి నాన్న కాఫీ కప్పుతో లోపలకు వస్తున్నాడు. రోజూ తనకు 'ఇస్తేనే గాని అతడు కాఫీ ముట్టడు.

కళ్ళు తెరవలేకపోతున్నాడు. రాత్రంతా నిద్రలేదు. తను కళ్ళు తెరవకపోవడంతో గబగబా వెళ్ళిపోతున్న నాన్నను క్రీగంట చూశాడు. అలా నిద్ర... మెలకువ... నిద్ర 'ఎప్పుడూ వదులుకోవద్దురా ఓరిమి, ఎన్నడూ ఒప్పుకోవద్దురా ఓటమి' ఆ రింగ్‌టోన్ మస్తిష్కంలో మెరుపులు పుట్టించింది. వెంటనే మంచం మీద నుంచి లేచాడు. అటెన్షన్‌లోకొచ్చి సెల్యూట్ కొట్టాడు నారాయణమూర్తి.

"బంగారయ్యగారి ఇంట్లో దొంగలు పడ్డారట, వెంటనే వెళ్ళండి" అతడికి మత్తు పూర్తిగా వదిలి పోయినట్లుగా అయ్యింది డీఎస్పీగారి స్వరం సెల్‌ఫోన్‌లో వినపడగానే.

వంటగదిలోకి చూశాడు. భార్య కూతుర్ని స్కూలుకు పంపడానికి తయారుచేస్తోంది. డ్రైవరుకు ఫోన్‌చేసి కాలకృత్యాలు పూర్తిచేసుకున్నాడు. డ్రెస్ వేసుకుని తయారయ్యేసరికి ఇంటిముందుకు జీప్‌వచ్చి ఆగింది.

"టిఫిన్ చెయ్యరా? మీ నాన్నగారు మీకోసం ప్రత్యేకంగా పొంగల్ చేశారు" అని భార్య అంటుంటే, అది విని లాలాజలం ఊరినా, "లేదు వెళ్ళాలి, అత్యవసరంగా... ఇంతకీ నాన్నె ఎక్కడ?" అన్నాడు బెడ్‌రూములోకి చూస్తూ.

“అగ్రహారంలో ఎవరికో బాగోలేదట. చూడటానికి హడావుడిగా వెళ్ళిపోయారు...” అంది భార్య.

“అలాగా” అంటూ డ్రెస్సింగ్ టేబుల్ అద్దంలో తనను చూసుకొని టోపీ సరిచేసుకుని బయటకువచ్చి జీప్ ఎక్కాడు, డ్రైవర్ సెల్యూట్ చేశాడు.

“సార్ పొంగల్ తినేసి రావలసింది, మీ నాన్నగారు బాగా చేస్తారు సార్. సంవత్సరం క్రితం ఏదో పెళ్ళిలో అనుకుంటా...తిన్నాను. చాలా బావుంది.” అన్నాడు డ్రయివర్.

వెంకటరత్నం మాటలకు బదులు చెప్పలేదు నారాయణమూర్తి. అతడికి ఇష్టంలేదు తండ్రి వంట చేయడం.

తాత రమణమూర్తి, తండ్రి భానుమూర్తి, మనవడు నారాయణ మూర్తికి వారసత్వంగా రాబోయే వంటల వృత్తికి స్వస్తి చెప్పేందుకు తను చాలా కష్టపడ్డాడు. డిగ్రీలో ప్రథమశ్రేణి, పొడుగ్గా, బలంగా ఉన్నాడు, పోలీస్ ఆఫీసరు పర్సనాలిటీ అంటూ తండ్రికి ఆత్మీయులు సలహా ఇచ్చారు. అతడూ కష్టపడ్డాడు. ఎస్సై పరీక్ష పాసయ్యాడు. భగభగమండే కట్టెల పొయ్యి ముందు కూర్చుని గరిటతిప్పిన తన తండ్రి అతడిని ఇంతవాడిని చేశాడు. రెండేళ్ళుగా స్వంత ఊళ్ళోనే ఇన్స్పెక్టరుగా ఉద్యోగం చేస్తున్నాడు నారాయణ మూర్తి.

తండ్రికి వంటలు చేసే పనిలేదు, అయినా ఆయన తన పూర్వపు వృత్తిని ఏమాత్రం వదులుకోనంటాడు. తండ్రికి వంటల్లో సహాయపడే వారు ముగ్గురు - నీళ్ళుమోసే కామయ్య, కూరగాయలు తరిగి, పప్పురుబ్బే నాంచా రమ్మ, వంటచేసేటప్పుడు సాయంచేసే గౌరీనాథం.

‘వీళ్ళెలా బతుకుతార్రా?, నేను అర్థాంతరంగా వంటలు మానేస్తే! ఓపిక ఉన్నన్నాళ్ళు చేస్తా. నాకింద ఆ ముగ్గురూ, నాపై ఆధారపడ్డవాళ్ళు’

అంటాడు నాన్న. ఈ విషయంలోనే తండ్రీ కొడుకులకు ఘర్షణ. దాంట్లో కొడుకుదే పైచేయి అయింది. మొత్తానికి నాన్నను వంటల వృత్తినించి మానిపించగలిగాను అనుకున్నాడు నారాయణమూర్తి.

ఫోన్ మోగింది. "అయ్యా మండలాఫీసులో పనిచేసే సర్వేయరు గోపాలంగారి కూతురి పెళ్ళి ఉదయం ముహూర్తం... ఈ విషయం మరిచి పోయారేమోనని గుర్తుచేస్తున్నానిప్పుడు" కానిస్టేబుల్ అన్నాడు.

ఔను మరిచేపోయాను. బంగారయ్యగారి ఇంటికి అటువైపేకదా వెళ్ళేది...పనిలో పని...ఓ పనయిపోతుంది అనుకుంటూ, "రుక్మిణీ కళ్యాణ మండపం దగ్గర ఆగుదాం..." అన్నాడు నారాయణమూర్తి.

పావుగంటలో జీపు కళ్యాణమండపం ముందు ఆగింది. 'ద్వారం ముందు అరటి స్థంభం మామిడి తోరణాలు. మంగళ వాయిద్యాలు లయ బద్ధంగా మోగుతున్నాయి. గోపాలం రెండు చేతులూ జోడించి ఎదురు పడ్డాడు. అప్పటికే పెళ్ళితంతు ముగిసింది. మంగళ సూత్రధారణ ఎవరో అక్షింతలు మిగిలింది. చేతిలో పోశారు.

వేగంగా ముందుకెళ్ళి ఆ జంటను ఆశీర్వదించి, జేబులోంచి ఐదొందల రూపాయల నోటుతీసి పెళ్ళికూతురి చేతిలో పెట్టి అంతే వేగంగా బైటకొచ్చాడు.

"సార్ టిఫిన్ చెయ్యకుండా వెళుతున్నారే!" గోపాలం పరిగెత్తుకుంటూ వచ్చేసరికి ఇక తప్పనిసరై, భోజనాల బల్ల దగ్గరకు నడిచాడు. అరిటాకులో వడ్డించిన పొంగల్, నెయ్యి మిరియాల గుబాళింపు. నోరు కాలుతున్నా గబగబా తినేశాడు. 'ఈ రుచి ఇదివరకు పరిచయమున్న రుచిలా వుందే' అనుకున్నాడు. నారాయణమూర్తి.

పెద్ద సైజు గ్లాసులో వేడివేడి కాఫీ పట్టుకొచ్చారు. కాఫీ మెల్లగా

తాగుతూ, నాన్న కలిపిన కాఫీలావుందే అనుకుంటూ చుట్టూ చూశాడు. నాన్నకు సాయపడే ఆ ముగ్గురూ-కామయ్య, నాంచారమ్మ, గౌరీనాథం.

అనుమానం వచ్చి కొంచెం ముందుకు నడిచాడు. దూరంగా గాడి పొయ్యి దగ్గర అంత చలిలో చెమటలు కక్కుతూ బాణలిలో గరిటతిప్పుతున్న అతడి తండ్రి భానుమూర్తి. కొడుకును చూసి తలొంచుకున్నాడు.

నారాయణమూర్తి మనసు వికలమయింది. అగ్రహారం వెళతానని అబద్ధంచెప్పి, నాన్న చేస్తున్న పని ఇదా!

గబగబా బైటికొచ్చి జీపు ఎక్కాడు. బంగారయ్యగారి బంగళా చేరుకునేవరకూ అతడి మనసు మనసులో లేదు. లోపలకెళ్ళేసరికి చాలా వాహనాలు కనిపించాయి.

"ఏమిటీ హడావుడీ?" అన్నాడు వాచ్‌మేన్‌ని.

"బంగారయ్యగారికి ఒంట్లో బాగోలేదు. వారిని చూడడానికి బంధువులు, స్నేహితులు వచ్చారు" అన్నాడు వాచ్‌మెన్.

"ఇంతకీ దొంగతనం సంగతేమిటీ?" ప్రశ్నించాడు.

"బంగళా పక్కన మామిడితోటలోని గెస్ట్‌హౌస్‌నించి భోషాణం ఎత్తుకుపోయారు క్రితం రాత్రి. భోషాణం అంటే బంగారయ్యగారి ప్రాణం. నిద్రలేవ గానే ఆ భోషాణం చూసిన తర్వాతే మిగతా పనులు" అన్నాడు వాచ్‌మాన్.

"ఆ భోషాణంలో ఏముందో?" ప్రశ్నించాడు నారాయణమూర్తి.

"ఏమో సార్ ఏముందో" అన్నాడు వాచ్‌మేన్.

'చెప్పడం ఇష్టంలేదు కాబోలు' అనుకుంటూ ముందుకు కదిలాడు. నారాయణమూర్తిని చూసి ఒక పొడుగ్గా వున్న వ్యక్తి, లాల్చీ పైజమాలో వచ్చి నమస్కారం చేశాడు.

బంగారయ్యగారి పెద్ద కొడుకు, వయసు నలభైలోపే, అంటే బంగారయ్యగారికి అరవైదాటి వుంటుంది అనుకుంటూ, "నాన్నగారికి ఎలా వుంది?" అన్నాడు నారాయణమూర్తి.

"నాన్నగారు డిప్రెస్ అయ్యారు. భోషాణం ఆయన ప్రాణం. మాకే ఆశ్చర్యంగా వుంది. దాన్ని ఎలా ఎత్తుకుపోయారోనని, నలుగురుగానీ ఎత్తలేరు" అన్నాడు కొడుకు.

"అయితే ఆ భోషాణం వుండే గది చూపించండి"

"రండి" అంటూ బంగారయ్యగారి కొడుకు ఆ ఆవరణదాటి గేటు లోంచి బయటకు కదిలాడు. పర్లాంగు దూరంలో పదిసెంట్ల స్థలంలో మామిడితోట. చుట్టూ ప్రహరీగోడ, లోపల రెల్లుగడ్డి కప్పిన రెండు గదుల విశ్రాంతి గృహం. దాని తాళం బద్దలయివుంది.

"ఈ మామిడితోటకు వాచ్‌మేన్ వుండడు, మామిడి పళ్ళ సీజనులోనే వాచ్‌మేన్‌ని పెడాతం మా బంగళా వాచ్‌మేన్ రోజుకోసారి చూసివెళతాడు. అదే అదనుగా తాళం బద్దలుకొట్టి భోషాణం ఎత్తుకుపోయారు" అన్నాడు కొడుకు

నారాయణమూర్తికి ఆ మాటలేవీ తలకెక్కడంలేదు, 'భోషాణంలో ఏంవుందో? బంగారపు బిస్కట్లా, లంకెబిందెలా, నల్లడబ్బా?' అతడి పోలీసు బుర్రలో ఎన్నో అనుమానాలు. ఆ ఇద్దరూ మాట్లాడ్తుండగానే -

పోలీస్ ట్రైనర్ కుక్కను తీసుకొచ్చాడు. దాన్ని మామిడి తోటంతా తిప్పించాడు. నారాయణమూర్తి తన ఇద్దరు కానిస్టేబుళ్ళతో దానిని అనుసరించాడు.

ఆ పోలీసుకుక్క ఆ ఆవరణదాటి కొంతదూరం వెళ్ళి దగ్గరలో వున్న ఇంజనీరింగ్ హాస్టలుదగ్గర ఆగిపోయింది. నారాయణమూర్తికి ఆశ్చరం.

‘ఇంజనీరింగ్ చదివేకుర్రాళ్ళు దొంగతనం చేస్తారా? పోలీసుకుక్కను నమ్ముకుని హాస్టలుమీద పడితే అదొక సమస్య! పైగా హాస్టలులో వంద గదులు. గదికి ముగ్గురు విద్యార్థులు.

మొత్తం మూడొందల మందిని ఎంక్వయిరీ చెయ్యడం అంటే మాటలా! ప్రస్తుతం ఎంక్వయిరీ ఆపుచేసి రెండు రోజుల్లో ఏదయినా క్లూదొరుకుతుందేమో చూద్దాం’ అనుకుంటూ తన ఆఫీసుదారి పట్టాడు నారాయణ మూర్తి.

*　　　*　　　*

ఆ రోజు సాయంత్రం ఇంటికి చేరుకునేసరికి తండ్రి తన తమ్ముడింటికి వెళ్ళాడనే సమాచారం విని బాధపడ్డాడు నారాయణమూర్తి. బహుశా ఉదయం తను ఆ పెళ్ళిలో ఆయనను వంటవాడిగా చూసినందుకేమో! ఆయన సెన్సిటివ్. ఇద్దరికీ వాగ్యుద్ధం వస్తుందని వెళ్ళిపోయివుంటాడు. అతని మనసు విలవిలాడింది.

రెండు రోజుల తర్వాత డీఎస్పీగారి నుంచి నారాయణమూర్తికి ఫోన్. ‘భోషాణం సంగతి ఏంతేల్చారు?’ అని.

“భోషాణంలో ఏంవుందో చెప్పడం లేదు సార్” అన్నాడు నారాయణ మూర్తి.

“మీరు తెలుసుకోండి, బంగారయ్యగారు ఈ ఊరి పురప్రముఖులు, ప్రముఖ వ్యాపారవేత్తగానేకాక, తన ట్రస్ట్ ద్వారా ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న ఆయనంటే రాజకీయ నాయకులకూ గురి వుంది. నాకు పైనుంచి ఒత్తిడి వస్తోంది...” అన్నాడు డీఎస్పీగారు.

“అలాగే సార్, ఈరోజు రాత్రే నా ఇన్వెస్టిగేషను మొదలుపెడతాను” అన్నాడు నారాయణమూర్తి.

అదే రోజు రాత్రి జీపులో ఆ హాస్టలుకు చేరుకున్నాడు. అమావాస్య చీకటి పలచగా వెలుగుతున్న వీధిదీపాలు. అక్కడక్కడ మొరుగుతున్న కుక్కల అరుపులు తప్ప అంతా నిశ్శబ్దం. ఊరికి దూరంకావడంతో రాత్రి తొమ్మిదింటికే నిర్మానుష్యం అయిపోయింది.

టార్చిలైటు వెలుగులో ఆ హాస్టలు చుట్టూ మూడు రౌండ్లు కొట్టాడు. ఆ హాస్టలు చుట్టూవున్న ప్రహరీగోడ కనబడకుండా దట్టంగా పెరిగిన పిచ్చ మొక్కలు. పెద్దగా పెరిగిన చెట్లు. దాంతో ఆ హాస్టలు బయట అడవిలా వుంది. ఇక లాభంలేదని జీపు ఎక్కి అక్కడనించి కదులుతుంటే “సార్ చూడండి ఆ పిచ్చమొక్కల మధ్య ఏదో మెరుస్తోంది” అరిచాడు కానిస్టేబుల్.

జీపుదిగి గబగబా పరిగెత్తుకుంటూ వెళ్ళి లాఠీతో మొక్కల మధ్య ఆ భాగాన్ని తట్టాడు. అతడికి ఖంగ్‌మంటూ శబ్దం వినిపించింది. తను, డ్రైవరు, ఇంకో ఇద్దరు కలిసి బలవంతంగా కష్టపడి బైటకు లాగిన ఆ భారీ సామాగ్రి ఒక ఇత్తడి భోషాణం.

“మైగాడ్ హాస్టలు కుర్రాళ్ళే చేసివుంటారు ఈ పని, పోలీసుకుక్కను చూసి భయపడి వదిలేసివుంటారు. ఏమైతేనేం కేసు తేలిపోయింది” అని తన సిబ్బందితో సంతోషంగా చెప్పాడు నారాయణమూర్తి.

* * *

తరువాతిరోజు బంగారయ్యగారి బంగళా ఆవరణ అంతా పుర ప్రముఖులు, వారి స్నేహితులు. వారి సంస్థలలో పనిచేసే సిబ్బందితో కళకళ లాడుతోంది.

నారాయణమూర్తిని ముఖ్య అతిథిగా పిలిచారు. ఆవరణ అంతా రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. అతిథులను వీనులవిందు చెయ్యడానికి మంద్రస్థాయిలో వీణావాదనం వినిపిస్తున్నాడొక వైణికుడు.

అతిథులంతా వారివారి సీట్లలో కూర్చొని వున్నారు. వారినందరినీ భోషాణం దొరికిన సందర్భంలో విందుకు పిలిచారు. వారిమధ్య చిరునవ్వులు చిందిస్తూ అందరికీ అభివాదం చేస్తున్నారు బంగారయ్యగారు.

వారికి ఎదురుగా విశాలమైన బల్లమీద వుంచిన భోషాణం అందరినీ ఆకర్షిస్తోంది. అందరితో కుశలప్రశ్నలు అయ్యాక బంగారయ్యగారు నోరు విప్పారు.

"అందరికీ వందనాలు, నా అహ్వానాన్ని మన్నించి ఈ విందు భోజనానికి వచ్చినందుకు కృతజ్ఞతలు" అంటూ చెప్పడం ఆపి నారాయణ మూర్తి వంక చూసి-

"అయ్యా ఎస్సైగారూ, ఆ విద్యార్థుల మీద కేసు వెయ్యకండి. పాపం చదువులు ఆగిపోతాయి. ఈ భోషాణంలో ఏముందో తెలుసుకుందామని ఎత్తుకెళ్ళారు తప్ప వారికి దీనిని దొంగిలించే ఉద్దేశ్యంలేదు. ఆ విషయం నాకూ తెల్సింది. మన సొత్తు మనకు దొరికింది, ఇక మీరు ఫైలు మూసేయ వచ్చు. మీకు కావలిస్తే రాతపూర్వకంగా కేసు విరమించుకుంటాను" అన్నాడు.

"అలాగే సార్!" అన్నాడు నారాయణమూర్తి.

"ఐతే నా ఆత్మీయులు అంతా ఇక్కడే ఉన్నారు కనుక ఈ సంతోష సమయంలో నా హృదయం మీ ముందు విప్పాలనివుంది" అన్నారు బంగారయ్యగారు.

శ్రోతలు ఆసక్తిగా చూశారు.

"ఈ భోషాణంలో ఏముందో తెలుసుకోవాలని మీ మనసులోని ఉద్దేశ్యం నాకు తెలుసు... మరోసారి దొంగతనం జరగడం నాకేమాత్రం ఇష్టం లేదు. ఈ సస్పెన్సుకు తెర తీసేస్తున్నాను. కేసును పరిశోధించిన నారాయణ మూర్తిగారే భోషాణం తెరవాలని నా ప్రార్థన" అంటూ బంగారయ్య గారు ఒక పొడుగ్గా వున్న తాళంచేవిని అతనికి అందించారు.

నారాయణమూర్తి తాళంతీసి పెట్టెతెరిచాడు. లోపల పెట్టెనిండా కాగితాలతో చుట్టిన చిన్నచిన్న పొట్లాలు. నారాయణమూర్తి బంగారయ్య గారివంక ప్రశ్నార్థకంగా చూశాడు. ఆయన నవ్వుతూ, ''ఆ పొట్లాలలో ఏముందో అందరికీ చూపించండి...'' అన్నాడు.

ఒక పొట్లం విప్పాడు. రెండు రూపాయల చిల్లర డబ్బులు. మరో పొట్లం విప్పినా అంతే! మరికొన్ని పొట్లాలు తీసి అందరికీ చూపించాడు. అన్ని పొట్లాలలోనూ చిల్లర డబ్బులే కనిపించాయి. ఆ భోషాణం నిండా అలాంటి చిల్లర పొట్లాలు కనిపించేసరికి అందరికీ మళ్ళీ ప్రశ్నార్థకం! ఈ చిల్లర వెనుక ఏ పరమార్థం దాగివుందో అనుకుంటూ అంతా ఆయనవైపే చూస్తున్నారు.

ఆ ఆవరణలోని కొబ్బరిచెట్లమీది ఆకులు వినయంగా ఊగు తున్నట్లు ఉన్నాయి. పూలమొక్కల మీద నుంచి వస్తున్న సౌరభంతో ఆ పరిసరాలు గుభాళిస్తున్నాయి. వైణికుడు తన వీణను ఆహ్లాదంగా శృతిచేస్తూ ఆ వాతావరణాన్ని సంగీతభరితం చేస్తున్నాడు.

బంగారయ్యగారు నోరు విప్పాడు.

''నలభయ్యేళ్ళ క్రిందటి సంగతి. వరదలు, వర్షాలతో మా ఊరు మునిగిపోయింది. చాలామంది ప్రాణాలు గోదారి గర్భంలోకి వెళ్ళిపోయాయి. అలా మా కుటుంబానికి నేనొక్కడినే మిగిలాను. కట్టుబట్లతో. ఈ ఊరొచ్చాను. పనికోసం ఊరంతా తిరిగాను. ఎక్కడా దొరకలేదు. నేనూ ఆ వరదల్లో కొట్టుకు పోవలసింది. భగవంతుడా నన్నెందుకు మిగిల్చావ్? అంటూ దేవుడి మీద కోప్పడ్డాను. కాళ్ళు అరిగేలా ఊరంతా తిరిగి శోష వచ్చి ఒక కిళ్ళీకొట్టు దగ్గర పడిపోయాను.

ఆ కిళ్ళీషాపులో అబ్బాయి నా వయసువాడే. నా ముఖంమీద

నీళ్ళు చల్లాడు. సోడా తాగించాడు. ఫరవాలేదు నేనున్నాను అంటూ ఓదార్చాడు. అలా, ఆ కిళ్ళీకొట్లో ఆ అబ్బాయిదగ్గర పనికి కుదిరాను.

కిళ్ళీలు కట్టడమే నా పని. ఆ అబ్బాయి నాలా ఒంటరివాడే. అంచేత అతడి గుడిసెలోనే నా మకాం. అలా నాకు బ్రతుకు తెరువు దొరికింది. సంవత్సరం తర్వాత ఆ అబ్బాయి కిళ్ళీకొట్టును నాకొదిలేసి బొంబాయి వెళ్ళి పోయాడు వ్యాపారం చేసుకుంటానని.

ఆ కిళ్ళీబడ్డీ ప్రాంతంలో ఒక భోజనశాల, మరొక కాఫీ హోటలు తెరిచారు. అంతే నా కిళ్ళీషాపు వృద్ధి చెందింది. దాన్ని కిరాణాషాపుగా మార్చాను.

ఆ తర్వాత అది హెూల్‌సెల్ దుకాణంగా రూపు దిద్దుకుంది. నలభయ్యేళ్ళల్లో ఊహించనంత ఎత్తుకు ఎదిగాను. ఇరవయ్యేళ్ళ క్రితం నాకు బ్రతుకుతెరువు చూపిన ఆ అబ్బాయి ఈ ఊరొచ్చాడు''

ఆయన చెప్పడం ఆపి గబగబా ఒక గ్లాసుడు మంచి నీళ్ళు తాగాడు. క్షణంసేపు మౌనంగా ఉండి మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు.

''ఈ ఊళ్ళో కిళ్ళీబడ్డీ ద్వారా సంపాదించిన కొద్దిపాటి సొమ్ముతో ఆ అబ్బాయి బొంబాయిలో వ్యాపారం సాగించి బాగా పైకొచ్చాడు. ఇరవయ్యేళ్ళల్లో ఆ మహా నగరంలో తనూ ఒక వ్యాపారవేత్తగా ఎదిగాడు.

నేనూ అదే క్రమంలో పెరిగినందుకు సంతోషించాడు. అయితే ఇద్దరమూ కిళ్ళీలమ్మే స్థితినుంచే పైకొచ్చాం. ఆ విషయం గుర్తుచేసుకున్నాం. మాలాగా ఆర్థిక సహాయం ఆశించేవారికి ఉపాధి కల్పించాలనుకున్నాం.

ఆ దిశగా మేం సాగాలంటే మా తల్లివేరైయిన కిళ్ళీ బడ్డీని మరిచి పోకూడదనుకున్నాము. అలా మరిచిపోతే మా బ్రతుక్కి అర్థం లేదనుకున్నాం. అందుకే గత ఇరవయ్యేళ్ళుగా సంక్రాంతి పర్వదినాన ఒక పనిచేస్తున్నాం'' అంటూ ఆయన మళ్ళీ చెప్పడం ఆపాడు.

ఆ ఆవరణలో ఆసీనులయిన సభికులలో ఉత్కంఠ ఎక్కువయింది. అంతా కళ్ళు ఆర్పకుండా దృష్టి మరల్చకుండా ఆయన చెప్పే మాటలు వింటూ వుండిపోయారు. ఆయన క్షణంసేపు ఆగి మళ్ళీ కొనసాగించారు.

"ఈ ఊళ్ళో కిళ్ళీబడ్డీతో జీవితాన్ని ప్రారంభించి, నా బ్రతుక్కి దారి చూపిన ఆ అబ్బాయి ఆ తర్వాత బొంబాయిలో తన వ్యాపారం కొనసాగించాడని మీకు మనవి చేశాను... అతడు అంతటితో ఆగలేదు తన వ్యాపారం అమెరికాకూ విస్తరింపచేశాడు.

ఆ అబ్బాయి సంక్రాంతి రోజున ఈ ఊరొస్తాడు. ఆ రోజు నేను అనుభవించే ఆనందం వర్ణనాతీతం.

సంవత్సరం అంతా ఆ ఒక్క రోజు కోసం ఎదురు చూస్తాను. ఆ రోజు మేం ఇద్దరం కలిసి నలభయ్యేళ్ళ క్రిందటి మా పాత జీవితంలోకి పరకాయ ప్రవేశం చేస్తాం. అంటే నేను తమలపాకులకు సున్నంరాసి, అన్ని దినుసులు వేస్తే ఆయన కిళ్ళీ కడతాడు.

ఆ రోజంతా మేం కిళ్ళీలు అమ్ముతాం. ఆ విధంగా అమ్మిన కిళ్ళీల డబ్బులు ఈ భోషాణంలో దాస్తాం. ఇది ఇరవయ్యేళ్ళుగా సాగుతున్న యజ్ఞం. మేం చేసే పని కొంతమందికి వింతగా అనిపిస్తుంది. ఇదేం వెర్రి అని మమ్మల్ని వేళాకోళం చేసిన వాళ్ళున్నారు.

ఐనా ఇన్ని సంవత్సరాలుగా దీన్ని కొనసాగిస్తున్నాం. మా పునాదులు ఏమిటో మరచిపోనివ్వకుండా నిరంతరం గుర్తుచేసే ఈ భోషాణం మా వర్తమానానికి పునాది. భవిష్యత్తుకు దిక్సూచి. ఇదీ మా వారసత్వ సంపద..." అంటూ బంగారయ్యగారు ఉపన్యాసం ముగించారు.

ఆయన మాటలు విన్న వారందరి మనసుల్లో ఆర్ద్రత. ఒక గొప్ప జీవిత సత్యాన్ని తెలుసుకున్నామనే తృప్తితో అందరూ భోజనాలవైపు కదిలారు.

నారాయణమూర్తికి మాత్రం తన తండ్రిని వెంటనే చూడాలనిపించింది. బంగారయ్యగారి మాటలతో అతడికి కొన్ని రోజులుగా మనసులో మెదులుతున్న సంఘర్షణకు తెరపడింది. అతని మనస్సులో సంతోషంగా ఉన్నా ఏదో తెలీని వేదనతో గుండెలు బరువుగా అనిపించాయి.

జీపువైపు కదిలాడు. ఆ ఊరికి నలభై కిలోమీటర్ల దూరంలో తన తమ్ముడి ఇంట్లో ఉన్న తండ్రిని చూడటం కోసం అతను ఆ రాత్రిపూట బయలుదేరాడు. జీపు కదిలింది. బంగారయ్యగారి బంగళా ఆవరణనించి ఆ వైణికుడు వీణమీదవాయిస్తున్న త్యాగరాజస్వామికీర్తిన 'సాధించెనే ఓ మనసా' గాల్లో తేలుతూ వినిపిస్తోంది నారాయణమూర్తికి.

(సి.పి. బ్రౌన్ స్వాతి వీక్లీ సంక్రాంతి కథల పోటీలో బహుమతి)

(స్వాతి వీక్లీ 30-10-2009)